ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

## సమస్యలను త్వరగా పరిష్కరించాలి

**కలెక్టర్ సత్య ప్రసాద్**

జగిత్యాల, నవంబర్ 18 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్ రెడ్డితో కలిసి తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా తీసుకున్న ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, డీఆర్డీవో రఘువరన్ పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ**

కోరుట్ల రూరల్, నవంబర్ 18 : సహకార సంఘం ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణం, మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ధాన్యం వరుస క్రమంలో నమోదు చేయాలని, తేమశాతం వచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. ఆర్డీవో జీవాకర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ధాన్యం రైస్‌మిల్‌లకు తరలించాలి**

మేడిపల్లి, నవంబర్ 18 : ధాన్యం మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేసి రైస్‌మిల్‌కు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండల కేంద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏవో షాహిద్ అలీ, సీఈవో బొందయ్య, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

కోరుట్ల, నవంబర్ 18 : పట్టణంలోని 8 సెంటర్లలో సోమవారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కిషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్..**

జగిత్యాల, నవంబర్ 18 : జిల్లాలో గ్రూప్-3 పరీక్షలను ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల్లో 3 పేపర్లకు గాను జిల్లాలో 34 సెంటర్లలో 10,656 మంది విద్యార్థులకు 5,501 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు శనివారం తెలిపారు. 51.62 శాతం హాజరైనట్లు వెల్లడించారు. కేంద్రాలను కలెక్టర్ బీ సత్యప్రసాద్, ఆర్డీవో తనిఖీ చేశారు.

## వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు

కోరుట్ల రూరల్, నవంబర్ 18 : మండలంలోని వెంకటాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. హుండీ లెక్కింపులో రూ.73 వేల 3 వందల 65, 2 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారం, 80 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం రాజమౌళి, ఈవో ఎం విక్రమ్ తెలిపారు. పూజారి వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు కటుకం రాజేశం, ద్యాగ రాజరెడ్డి, రాజేశం గౌడ్, పిట్టల రమేశ్, మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, బర్కం గంగలక్ష్మి, నర్సయ్య, విఠల్, రవీంధర్‌రెడ్డి, సిబ్బంది నర్సయ్య, రాజేందర్, గంగాధర్, శివకేశవ్ పాల్గొన్నారు.

హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

## కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

మెట్‌పల్లి, నవంబర్18 : పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన 64 మందికి సోమవారం క్లబ్ ప్రతినిధులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండాల రాకేశ్, కోశాధికారి వేణు గోపాల్, జోనల్ చైర్మన్ గడ్డం శంకర్‌రెడ్డి, మర్రి భాస్కర్, బొమ్మెల శంకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

## మండలంలో 80 శాతం సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

పెగడపల్లి, నవంబర్ 18: మండలంలో సోమవారం వరకు 80 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి అయినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ మండలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే కొనసాగుతోందని, 23 పంచాయతీల్లో మొత్తం 15022 కుటుంబాలు ఉన్నట్లు ఎన్యుమరేటర్లు గుర్తించగా, 12005 కుటుంబాల సర్వే పూర్తి చేశామని, మరో రెండు రోజుల్లో సర్వే పూర్తవుతుందని ఎంపీడీవో వివరించారు. కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుబద్ర, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

## ఇంటింటి సర్వేతో వ్యక్తి గత విషయాలు భహిర్గతం

**డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్**

కీచులాటపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న భూమేశ్వర్

పెగడపల్లి, నవంబర్ 18 : ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేతో వ్యక్తి గత విషయాలు బహిర్గతం అయ్యే ప్రమాదం ఉందని దళిత హక్కుల పోరాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ ఆరోపించారు. సోమవారం మండలంలోని కీచులాటపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే ఉద్దేశం మంచిదే అయినప్పటికినీ, ప్రతి కుటుంబ సభ్యుల ఆధార్, సెల్ ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు సేకరించడంపై వ్యక్తి గత విషయాలు బయటకు రావడంతో సైబర్ నేరగాళ్ల వల్ల మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. చట్ట ప్రకారం.. వ్యక్తి గత సమాచారం ఇవ్వాల్సినవసరం లేదని పేర్కొంటూ, ఇలాంటి వివరాలు బయటకు రాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భూమేశ్వర్ డిమాండ్ చేశారు.

# అభివృద్ధి ఫలాలు అందించిన ఘనత కేసీఆర్‌దే

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- 189 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోరుట్ల, నవంబర్ 18: సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 189 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా చూసుకున్నారని, మహిళలకు ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, తదితర పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మూసీ చుట్టూ తిరగడం, పేదల ఇండ్లు కూల్చడం తప్ప ఒక్క అభివృద్ధి పని చేసింది లేదని దుయ్యబట్టారు. ప్రజలకు ఇబ్బందుల పాలు చేయడమే కాంగ్రెస్ నైజమని ఆరోపించారు. మళ్లీ పాత రోజులు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఇప్పిస్తామని చెప్పి కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సినవసరం లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన చెక్కులు అందించే బాధ్యత తమదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు బట్టు సునీల్, పోగుల ఉమారాణి, కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, పేర్ల సత్యం, అన్వర్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిదులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రాయికల్, నవంబరు 18 : మండలంలోని ఆలూరు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి కందుకూరి స్వాతి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం ఉండదని, ఖచ్చితమైన మార్కెటింగ్ వ్యవస్థ ఉందని, ప్రస్తుతం ఒక టన్ను ధర రూ.19 వేలు ఉందన్నారు. ప్రభుత్వం మొక్కలను, డ్రిప్ పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. మొక్క నాటిన 3 సంవత్సరాల తర్వాత కోత మొదలై 30 ఏండ్ల వరకు ప్రతి నెలా దిగుబడి ఇస్తుందని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత**

జగిత్యాల రూరల్, నవంబర్ 18 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత సూచించారు. సోమవారం మండలంలోని అంతర్గాం, నర్సింగాపూర్, అర్బన్ మండలంలోని అంబారిపేట, ధరూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆకస్మికంగా తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం వివరాలు, తేమశాతం పరిశీలించారు. సివిల్ సప్లైయ్ అధికారి వరరప్రసాద్, పుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, మరియా, ఆయా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## కార్మికుల వేతనాలు పెంచాలి

**ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు**

జగిత్యాల, నవంబర్ 18 : మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ కార్మికుల వేతనాలు పెంచాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేసే కార్మికులకు ఆరు నెలలుగా బిల్లు లు, వేతనాలు రాకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీఈవో జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన పదివేల వేతనం చెల్లించేలా జీవో తీసి కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులతో పాటు పార్లమెంట్, శాసనసభ్యులకు వినతి పత్రాలిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే జనవరి నుంచి నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందన్నారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రం, జిల్లా నేతలు మునుగోరి హనుమంతు, శారద, రాజమణి, పద్మ, భాగ్యలక్ష్మి, చొప్పరి గంగాధర్, గంగు లక్ష్మి, సబియా బేగం, పద్మ పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న సెర్ఫ్ ఏపీఎం దేవరాజ్

మల్లాపూర్, నవంబర్ 18 : గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని సెర్ఫ్ ఏపీఎం దేవరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళల అభివృద్ధికి సెర్ప్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీలు లక్ష్మీరాజం, రమేశ్, రాజు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సీఐ, ఎస్ఐని సన్మానించిన ఎమ్మెల్యే

కొడిమ్యాల, నవంబర్ 18 : మండలంలోని నాచుపల్లిలో సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మల్యాల సీఐ నీలం రవిని, కొడిమ్యాల, మల్యాల మండలాల ఎస్ఐలు సందీప్, నరేశ్ కుమార్‌ను శాలువాతో సన్మానించారు. మండలంలోని నాచుపల్లి గ్రామం నుంచి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా కొండగట్టు గుట్టపైకి వేళ్లే దారిలో రోడ్డుకు అనుకొని ఉన్న ప్రమాదకర బావిని రెండు రోజులుగా మట్టితో పూడ్చేందుకు వారు సహకరించినందున శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేసినందుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులున్నారు.

హైకోర్టు రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ఈవో

## ధర్మపురిలో పూజలు..

ధర్మపురి,నవంబర్18 : రాష్ట్ర హైకోర్ట్ రిజిస్ట్రార్ వీ రమేశ్ సోమవారం కుటుంబసమేతంగా ధర్మపురిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పండితులు ఆ యనను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండపంలో ఈవో శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు.

**అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి ..**

ధర్మపురి సన్నిధిలో జగిత్యాల జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి నారాయణ స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

**భక్తులకు అన్నదానం..**

మల్లాపూర్, నవంబర్ 18 : మండలకేంద్రంలోని కనక సోమేశ్వరస్వామి కొండ వద్ద కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటకు చెందిన ఏనుగు విశ్వనాథ్‌రెడ్డి-కీర్తన దంపతుల ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు కొండపై ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు బల్యపల్లి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ కమిటీ అధ్యక్షుడు సంగ గంగరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

మల్లాపూర్, నవంబర్ 18: మండల కేంద్రానికి చెందిన మార్కెట్‌కమిటీ డైరెక్టర్ నూతిపల్లి రాజం కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, వారి కుటుంబ సభ్యులను సోమవారం టీ పీసీసీ నేత జువ్వాడీ కృష్ణారావు పరామర్శించారు. నాయకులు అంతడ్పుల నర్సయ్య, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, ముత్యాల చంద్రశేఖర్, తోట నారాయణ పాల్గొన్నారు.

## పోగుల లత న్యాయపోరాట కమిటీ ఏర్పాటు

సారంగాపూర్, నవంబర్ 18: ఇటీవల వరకట్న హత్యకు గురైన పోగుల లత పేరుతో న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రేచపల్లికి చెందిన లత నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రేవోజీపేటలో హత్యకు గురికావడంతో ఇక నుంచైనా ఇలాంటి వరకట్న హత్యలు, వేదింపులు, హింసలు జరుగకూడదని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు ఏకమై ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోగుల లత న్యాయ పోరాట కమిటీ కన్వీనర్‌గా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్గొండ పద్మ, చైతన్య మహిళా సంఘం ప్రతినిధులు శ్రీదేవి, సంఘాల ప్రతినిధులు అరిగెల పద్మ, పుల్ల సుచరిత, సుశీలతో పాటు మృతురాలు తల్లి పోగుల మల్లేశ్వరిని కో కన్వీనర్లుగా నియమించారు. పోగుల లత హత్యపై చట్టపరంగా సరైన న్యాయం జరిగేంత దాకా ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. త్వరలోనే ప్రణాళిక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శ



లస్మయ్య చిత్రపటం వద్ద నివాలర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, నవంబర్ 18: మండల కేంద్రానికి చెందిన ఆర్ లస్మయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ జలందర్, మాజీ వైస్ ఎంపీపీ సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ ఉప సర్పంచ్ రాజశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

**దివ్యాంగులకు ఆటల పోటీలు**

జగిత్యాల రూరల్, నవంబర్ 18: జిల్లాలోని దివ్యాంగులకు ఈ నెల 21న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని.. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినిస్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బీ నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 54 ఏండ్లలోపు వారు పోటీల్లో పాల్గొనాలన్నారు. అంధులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్ పోటీలు, బదిరులకు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారం, శారీరక మానసిక దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్‌తో పాటు పరుగు పందెం, షాట్ పుట్, క్యారంబోర్డు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని సూచించారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

జగిత్యాల రూరల్, నవంబర్ 18: మండలంలోని హన్మాజీపేట గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు దామోధర్ బావ ఇట్నేని రమేశ్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం పరామర్శించారు. నాయకులు బాల ముకుందం, చంద శేర్, మహేశ్, రవి, నరేశ్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

విద్యార్థి దిలీప్

సారంగాపూర్, నవంబర్ 18 : బీర్‌పూర్ మండలంలోని మంగెళ గ్రామంలోని గొండుగూడెంకు చెందిన మాడవి శంకర్, శకుంతల కుమారుడు దిలీప్ ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన హర్యానా రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. దిలీప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికపై సోమవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దిలీప్ ములుగు జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

## రెండు ఉద్యోగాలు సాధించిన రైతు బిడ్డకు సన్మానం

పెగడపల్లి, నవంబర్ 18: మండలంలోని ఐతుపల్లికి చెందిన రైతు కట్కూరి సుధాకర్‌రెడ్డి-అరుణ దంపతుల కొడుకు కట్కూరి సాయికిణ్‌రెడ్డి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, సోమవారం గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. సాయికిరణ్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4లో మున్సిపల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు అతడిని అభినందిస్తూ సన్మానించారు. మాజీ విండో చైర్మన్ ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వడియాల అరుణ, నాయకులు మూల రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, పలుమారు విజయ్‌యాదవ్, లచ్చయ్య, ఎండీ జానీ పాష, తిరుపతిరెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరావు, మల్లేశం, ముని తదితరులున్నారు.

ఐతుపల్లిలో సాయికిరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల, నవంబర్ 18: పట్టణంలోని మాదాపూర్ కాలనీ ఏరియాలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పటుడుతుందని పట్టణ విద్యుత్ ఏఈ శ్యామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మేడిపల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటుపై హర్షం

మేడిపల్లి, నవంబర్ 18 : మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై భీమారం, మేడిపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, ఏనుగు రమేశ్‌రెడ్డి సోమవారం హర్షం వ్యక్తం చేశారు. కాలేజ్ ఏర్పాటుకు కృషి చేసిన విఫ్ ఆదిశ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేపూరి నాగరాజు, దాసరి గణేశ్, నర్సారెడ్డి, మల్లేశ, ఉరుమడ్ల నర్సయ్య, చెక్కపల్లి సంజీవ్, దాసరి శంకర్, ఉరుమడ్ల లక్ష్మణ్, శ్రీపతి దామోదర్, అరుణ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

## బీటులో దినుసుల కొనుగోలు..

జగిత్యాల టౌన్, నవంబర్ 18 : జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం మక్కలకు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ. 2000, గరిష్ట ధర రూ. 2425 చొప్పున ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టీ రాజశేఖర్ తెలిపారు. అదేవిధంగా ఎంటీయూ 1010 రకం వరి ధాన్యానికి రూ. 1950 - 2143, బీపీటీకి రూ. 1900 - 2221, హెచ్ఎంటీకి రూ. 2110 - 2240, జేఎస్ఆర్‌కు రూ. 2000 - 2711 చొప్పున ధరలు లభించినట్లు వివరించారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

రాయికల్, నవంబరు 18: మండలంలోని రామాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త ధనుంజయ యాదవ్ సోమవారం పాఠశాల విద్యార్థులు క్రికెట్ ఆడేందుకు కావాల్సిన క్రీడా సామగ్రిని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ప్రతాప్ రెడ్డి, గ్రామ నాయకులు కోల రాజు, హరీశ్‌రావు, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రాయికల్, నవంబర్ 18 : మండలంలోని రామాజీపేటకు చెందిన న్యావనంది మధు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రవాస భారతీయులు దుబాయ్‌లోని వారధి సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన రామాజీపేట యువకులు 56 మంది కలిసి దుబాయ్ వారధి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దుబాయ్ వారధి సంఘం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

## సర్వేపై అపోహలు వద్దు : ఎమ్మెల్సీ

వివరాలను పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

రాయికల్, నవంబరు 18 : సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు అపోహలు ప